


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM


## వేసవిలో కీర దోస తింటే ఎన్నో అద్భుత ప్రయోజనాలు..!

వేసవిలో కీర దోసకాయ తినడం వల్ల ఆరోగ్యానికి అనేక లాభాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. దీనిలో 96% నీరు ఉండడం వల్ల.. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. ఇంకా చక్కెర స్థాయిని, బరువు, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తులు , ఆటో ఇమ్యూన్ వ్యాధులతో సహా అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడుతుంది. అలాగే కిడ్నీలో ఏర్పడిన రాళ్లను కరిగించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది.

# ఉప్పల్ ఊచకోత




నాటి తుపానును మించే సునామీ ఇప్పుడొచ్చింది. ఈసారి వేదిక మన భాగ్యనగరమే. 20 ఓవర్లలో 277/3 స్కోరుతో ఐపీఎల్‌లో అత్యంత విధ్వంసక జట్టుగా కొత్త రికార్డు మన సన్‌రైజర్స్ హైదరాబాద్‌దే. నాడు గేల్ ఒక్కడు ప్రత్యర్థి బౌలింగ్‌ను ఊచకోత కోస్తే.. ఈసారి ముగ్గురు సన్‌రైజర్స్ యోధులు కలిసి వీర విధ్వంసం సృష్టించారు.

ఒకడు మెరుపైతే.. ఇంకొకడు ఉరుమయ్యాడు.. మరొకడు పిడుగులా పడ్డాడు. ట్రావిస్ హెడ్ (62; 24 బంతుల్లో 9x4, 3x6), అభిషేక్ శర్మ (63; 23 బంతుల్లో 3x4, 7x6), హెన్రిచ్ క్లాసెన్ (80 నాటౌట్; 34 బంతుల్లో 4x4, 7x6).. ఈ ముగ్గురూ కలిసి ఉప్పల్ స్టేడియంలోకి పరుగుల సునామీనే తీసుకొచ్చారు.

ముంబయి బ్యాటర్లేమైనా తక్కువ తిన్నారా? ఛేదన అసాధ్యమనిపించినా.. ప్రయత్నం మానలేదు. తిలక్ వర్మ (64; 34 బంతుల్లో 2x4, 6x6), టిమ్ డేవిడ్ (42 నాటౌట్; 22 బంతుల్లో 2x4, 3x6), ఇషాన్ కిషన్ (34; 13 బంతుల్లో 2x4, 4x6) శక్తి వంచన లేకుండా ధ్వంస రచన చేశారు. కానీ చివరికి 246/5తో ఓటమి వైపే నిలిచింది ముంబయి. ఐపీఎల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక్క మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదయ్యాయి. అందులో 31 ఫోర్లు, 38 సిక్సర్లుండడం విశేషం.

బౌలర్లు నిస్సహాయులై.. ఫీల్డర్లు ప్రేక్షకులైన మ్యాచ్‌లో.. పదే పదే ఫోర్, సిక్స్ సంకేతాలు ఇస్తూ అంపైర్లకు మాత్రం బోలెండంత పనే! నభూతో అనిపించే విధ్వంసక విన్యాసాలను ఓవైపు ఆస్వాదిస్తూనే.. మరోవైపు బంతి ఎటు నుంచి దూసుకొచ్చి తమపై పడుతుందో అని ఉత్కంఠను అనుభవించిన హైదరాబాదీ అభిమానులకు ఈ మ్యాచ్ ఓ చిరస్మరణీయ జ్ఞాపకమే!

ఐపీఎల్ చరిత్రలో నిలిచిపోయే మ్యాచ్‌లో సన్‌రైజర్స్ అద్వితీయమైన బ్యాటింగ్‌తో అదరగొట్టింది. బ్యాటర్లు మెషీన్ గన్నుల్లా పేలడంతో ఐపీఎల్‌లో రికార్డు స్కోరుతో సత్తాచాటింది. తొలి మ్యాచ్‌లో త్రుటిలో ఓడినా.. రెండో పోరులో చిరస్మరణీయ విజయం అందుకుంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 31 పరుగుల తేడాతో ముంబయిని ఓడించింది. ట్రావిస్ హెడ్ (62; 24 బంతుల్లో 9x4, 3x6), అభిషేక్ శర్మ (63; 23 బంతుల్లో 3x4, 7x6), మార్‌క్రమ్ (42 నాటౌట్; 28 బంతుల్లో 2x4, 1x6), హెన్రిచ్ క్లాసెన్ (80 నాటౌట్; 34 బంతుల్లో 4x4, 7x6) ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 277 పరుగుల రికార్డు స్కోరు నమోదు చేసింది. అనంతరం భారీ లక్ష్యఛేదనకు బాటలు వేసిన ముంబయి చివర్లో తడబడింది. 20 ఓవర్లలో 5 వికెట్లకు 246 పరుగులు చేయగలిగింది. హైదరాబాదీ తిలక్ వర్మ (64; 34 బంతుల్లో 2x4, 6x6), టిమ్ డేవిడ్ (42 నాటౌట్; 22 బంతుల్లో 2x4, 3x6); ఇషాన్ కిషన్ (34; 13 బంతుల్లో 2x4, 3x6) పోరాడినా ఫలితం లేకపోయింది.

పోరాడిన ముంబయి: ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యం ముందున్నా.. ముంబయి వెనక్కి తగ్గలేదు. మొదట్నుంచే బ్యాటుకు పని చెప్పిన ఓపెనర్లు రోహిత్ శర్మ (26; 12 బంతుల్లో 1x4, 3x6), ఇషాన్ కిషన్ ముంబయి ఉద్దేశాన్ని స్పష్టంచేశారు. పోరాడితే పోయేదేమీ లేదన్నట్లుగా పరుగుల వేట మొదలు పెట్టారు. ఉనద్కత్‌ను రోహిత్.. భువనేశ్వర్‌ను ఇషాన్ ఆటాడుకున్నారు. రోహిత్ రెండు సిక్సర్లు బాదగా.. ఇషాన్ మూడు సార్లు బంతిని స్టాండ్స్‌కు పంపించాడు. షాబాజ్ అహ్మద్‌కు సిక్సర్‌తో స్వాగతం చెప్పిన ఇషాన్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించి నిష్క్రమించాడు. రోహిత్ సైతం కమిన్స్ ఓవర్లో సిక్సర్ బాది.. తర్వాతి బంతికే వెనుదిరిగాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 56 పరుగులు (20 బంతుల్లో) జతచేశారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. క్రీజులోకి వచ్చిన బ్యాటర్లు మాత్రం బ్యాట్లు ఝుళిపించడం మానలేదు. పవర్ ప్లేలో 76 పరుగులు రాబట్టిన ముంబయిని నమన్ ధీర్ (30; 14 బంతుల్లో 2x4, 2x6), తిలక్‌వర్మ లక్ష్యం దిశగా తీసుకెళ్లారు. 8 ఓవర్లలోనే ముంబయి స్కోరు 100 పరుగులు దాటింది. షాబాజ్ వేసిన పదో ఓవర్లో తిలక్ మూడు సిక్సర్లతో 22 పరుగులు పిండుకున్నాడు. ఫలితంగా 10 ఓవర్లలో ముంబయి 141 పరుగులు సాధించింది. ఐపీఎల్ చరిత్రలో తొలి 10 ఓవర్లలో అత్యధిక స్కోరు (గతంలో 131) రికార్డును ఈ మ్యాచ్‌లో రెండు జట్లూ దాటాయి. ఇక తిలక్ 24 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించగా.. నమన్ నిష్క్రమణ తర్వాత క్రీజులోకొచ్చిన హార్దిక్ ఒక సిక్సర్, బౌండరీతో జోరు మీద కనిపించాడు. 36 బంతుల్లో 96 పరుగులు కావాల్సిన సమయంలో కమిన్స్ స్లో బంతిని భారీషాట్ ఆడిన తిలక్.. డీప్ మిడ్ వికెట్‌లో మయాంక్ అగర్వాల్ చేతికి చిక్కాడు. చివర్లో టిమ్ డేవిడ్ ప్రయత్నించినా.. కొండంత లక్ష్యాన్ని కరిగించలేకపోయాడు. ఆఖరి ఓవర్లో 47 పరుగులు అవసరమవడంతో ముంబయి ఓటమి ఖరారరైపోయింది.

అంచనాలు తలకిందులు: నిజానికి ఈ మ్యాచ్ ముంబయి బ్యాటర్లు × సన్‌రైజర్స్ బౌలర్లు మధ్య అనుకున్నారంతా! కానీ ఈ విశ్లేషణ తలకిందులవడానికి ఎంతోసేపు పట్టలేదు. తుపాను ముందు ప్రశాంతతలా.. తొలి ఓవర్లో ఏడు పరుగులతో నెమ్మదిగా మొదలైన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో హార్దిక్ వేసిన రెండో ఓవర్ తొలి బంతే మ్యాచ్‌కు మలుపు. ట్రావిస్ హెడ్ షాట్ బాదగా.. మిడాఫ్‌లో టిమ్ డేవిడ్ చేతుల్లో నుంచి బంతి బౌండరీకి దూసుకెళ్లింది. అప్పుడు హెడ్ స్కోరు 5. ఆ క్యాచ్ పట్టుంటే పరిస్థితి ఎలా ఉండేదో కానీ.. అక్కడ్నుంచి ఉప్పల్ స్టేడియం మోతమోగింది. దక్షిణాఫ్రికా అండర్-19 పేసర్ క్వెనా మఫాకా బౌలింగ్‌లో హెడ్ గేరు మార్చాడు. వరుసగా 6, 6, 4, 4తో 22 పరుగులు పిండుకున్నాడు. ఆపై హెడ్ హార్దిక్ బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మయాంక్ (11) తర్వాత క్రీజులో అడుగుపెట్టిన అభిషేక్‌శర్మ విశ్వరూపమే చూపించాడు. ఇటు హెడ్.. అటు అభిషేక్ బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వరద పారించారు. కొయెట్జీ బౌలింగ్‌లో ఫ్రీహిట్‌ను సిక్సర్‌గా మలిచిన అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు.

10.2 ఓవర్లకే 150..: హెడ్, అభిషేక్ వీరవిహారంతో పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ 81 పరుగులు సాధించింది. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లాకు చుక్కలే కనిపించాయి. అభిషేక్ మూడు సిక్సర్లతో 21 పరుగులు రాబట్టాడు. ఫలితంగా ఏడో ఓవర్లోనే సన్‌రైజర్స్ 100 పరుగులు మైలురాయిని అధిగించింది. హెడ్‌ను కొయెట్జీ పెవిలియన్‌కు పంపినా.. అభిషేక్ ఏమాత్రం తగ్గలేదు. మఫాకా బౌలింగ్‌లో వరుసగా 4, 6, 6తో చెలరేగి కేవలం 16 బంతుల్లోనే అర్ధసెంచరీ రాబట్టాడు. సన్‌రైజర్స్ 10.2 ఓవర్లలోనే 150 పరుగులకు చేరుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా ఈ మైలురాయిని అందుకన్న తొలి జట్టుగా సన్‌రైజర్స్ నిలిచింది. అభిషేక్‌కు చావ్లా పగ్గాలు వేసినా సన్‌రైజర్స్ జోరు మాత్రం తగ్గలేదు. హెడ్, అభిషేక్ తుఫాన్ తర్వాత మార్‌క్రమ్, క్లాసెన్ సునామీ మొదలైంది. దీంతో సన్‌రైజర్స్ 14.4 ఓవర్లలోనే 200 పరుగులు సాధించింది. క్లాసెన్, మార్‌క్రమ్ పోటీపడి బాదేయడంతో సన్‌రైజర్స్ టాప్ గేర్‌లో దూసుకెళ్లి రికార్డు స్కోరును అందుకుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: మయాంక్ (సి) డేవిడ్ (బి) పాండ్య 11; హెడ్ (సి) నమన్ (బి) కొయెట్జీ 62; అభిషేక్ (సి) నమన్ (బి) చావ్లా 63; మార్‌క్రమ్ నాటౌట్ 42; క్లాసెన్ నాటౌట్ 80; ఎక్స్‌ట్రాలు 19;

మొత్తం: (20 ఓవర్లలో 3 వికెట్లకు) 277;

వికెట్ల పతనం: 1-45, 2-113, 3-161;

బౌలింగ్: మఫాకా 4-0-66-0; హార్దిక్ పాండ్య 4-0-46-1; బుమ్రా 4-0-36-0; కొయెట్జీ 4-0-57-1; చావ్లా 2-0-34-1; షామ్స్ ములాని 2-0-33-0

ముంబయి ఇన్నింగ్స్: రోహిత్ (సి) అభిషేక్ శర్మ (బి) కమిన్స్ 26; ఇషాన్ కిషన్ (సి) మార్‌క్రమ్ (బి) షాబాజ్ 34; నమన్ ధీర్ (సి) కమిన్స్ (బి) ఉనద్కత్ 30; తిలక్ వర్మ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64; హార్దిక్ పాండ్య (సి) క్లాసెన్ (బి) ఉనద్కత్ 24; టిమ్ డేవిడ్ నాటౌట్ 42; రొమారియో షెపర్డ్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 11;

మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 246;

వికెట్ల పతనం: 1-56, 2-66, 3-150, 4-182, 5-224;

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4-0-53-0; ఉనద్కత్ 4-0-47-2; షాబాజ్ అహ్మద్ 3-0-39-1; కమిన్స్ 4-0-35-2; ఉమ్రాన్ మాలిక్ 1-0-15-0; మయాంక్ మార్కండె 4-0-52-0

**148**
తొలి 10 ఓవర్లలో సన్‌రైజర్స్ స్కోరు. గత రికార్డు (2014లో పంజాబ్, 2021లో ముంబయి 131 పరుగులు) కనుమరుగైంది.

**523**
ఈ మ్యాచ్‌లో నమోదైన పరుగులు. ఐపీఎల్‌లో ఓ మ్యాచ్‌లో అత్యధిక పరుగుల రికార్డు ఇదే.

**277/3**
ముంబయిపై సన్‌రైజర్స్ స్కోరు. ఐపీఎల్ చరిత్రలోనే ఓ జట్టు అత్యధిక స్కోరు ఇదే. ఆర్సీబీ (2013లో పుణె వారియర్స్‌పై 263/5) రికార్డు బద్దలైంది. ఓవరాల్‌గా పురుషుల టీ20ల్లో నేపాల్ (314/3), అఫ్గానిస్థాన్ (278/3) మాత్రమే సన్‌రైజర్స్ కంటే ముందున్నాయి.


**16**
అర్ధశతకం సాధించేందుకు అభిషేక్ శర్మ ఆడిన బంతులు. సన్‌రైజర్స్ తరపున ఐపీఎల్‌లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన బ్యాటర్ అతనే.

**1**
ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో ఒకే జట్టు నుంచి 20 బంతుల్లోపే అర్ధశతకాలు పూర్తి చేసుకున్న తొలి ద్వయంగా హెడ్- అభిషేక్ నిలిచారు.

**38**
ఈ మ్యాచ్‌లో సిక్సర్ల సంఖ్య. ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు రికార్డు (ఆర్సీబీ- 33) బద్దలైంది.

**66**
ముంబయి పేసర్ మఫాక సమర్పించుకున్న పరుగులు. ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చుకున్నది అతనే.

**200**
ముంబయి తరపున ఐపీఎల్‌లో రోహిత్ ఆడిన మ్యాచ్‌లు. ఆ జట్టు తరపున అత్యధిక మ్యాచ్‌లు ఆడింది అతనే. ఈ సందర్భంగా మ్యాచ్‌కు ముందు రోహిత్‌కు సచిన్ 200 నంబరుతో కూడిన ప్రత్యేక జెర్సీ, టోపీ బహుకరించాడు.



## బిస్కెట్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాదులోని రాజేంద్రనగర్ లో ఓ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న కాటేదాన్ ప్రాంతంలో బిస్కెట్ తయారీ పరిశ్రమలో తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. కాటేదాన్ లో ఉన్న రవి బిస్కెట్ తయారీ పరిశ్రమలో నేటి ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. ఆ సమయంలో మంటలు క్రమంగా ఫ్యాక్టరీలోని మూడు అంతస్తులకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపు చేస్తున్నారు. అయితే ఈ ప్రమాదానికి ఇంకా అసలు కారణం తెలియ రాలేదు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఓపెన్ స్కూల్ చదివితే డీఎస్సీకి చాన్స్ లేనట్టే

ఓపెన్ స్కూల్ విధానంలో కోర్సులు చేసిన వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అవకాశం ఉండదని అధికార వర్గాలు తెలిపాయి. వీళ్ల గతంలో టెట్ పాసయినా ఉపాధ్యాయ నియామకాల్లో దరఖాస్తు చేసేందుకు అనుమతి నిరాకరించాలని నిర్ణయించారు. ఇటీవల జరిగిన విద్యాశాఖ సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్నారు. దీనివల్ల దాదాపు 25 వేల మంది డీఎస్సీకి దూరమయ్యే అవకాశం ఉంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ గతంలో ఇంటర్ ఉత్తీర్ణతతో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించింది. వీటిని రెగ్యులర్ డీఎడ్ కోర్సులతో సమానంగా భావించారు. ఈ అర్హతతో అభ్యర్థులు ఇంతకాలం రాష్ట్రంలో నిర్వహించిన టెట్‌కు హాజరయ్యారు. టెట్ దరఖాస్తులో అర్హత కాలంలో డీఎడ్‌కు బదులు 'ఇతరులు' అనే కాలంతో వీళ్లు దరఖాస్తు చేసేవాళ్లు. కానీ సుప్రీంకోర్టు జనవరిలో ఈ వ్యవహారంపై తీర్పు చెప్పింది. రెగ్యులర్ డీఎడ్‌తో ఇది సమానం కాదని పేర్కొంది. నేషనల్ ఓపెన్ స్కూల్ ఇచ్చే సర్టిఫికెట్‌తో కేవలం ప్రైవేటు స్కూళ్లలో టీచర్లుగానే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఈ తీర్పును అమలు చేయాలని భావిస్తోంది. టెట్‌కు, డీఎస్సీకి ఇప్పటికే ఎవరైనా దరఖాస్తు చేసినా, వెరిఫికేషన్‌లో వీరిని పక్కన పెట్టాలని అధికారులు నిర్ణయించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకే ఇలా చేయాల్సి వస్తోందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.





## నేడు నంద్యాలలో సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర..

నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రెండో రోజు మేమంత సిద్ధం బస్సు యాత్ర నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నైట్ హాల్ట్ ప్రాంతం నుంచి ప్రారంభం కానుంది. ఇవాళ ఉదయం 9 గంటలకు ఆళ్లగడ్డ నుంచి బయలుదేరి నల్లగట్ల, బత్తలూరు, ఎర్రగుంట్ల చేరుకొని గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. ఆ తర్వాత గోవిందపల్లి మీదుగా ప్రయాణించి చాబోలు శివారులోని రైతు నగరం వద్ద మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారు. ఇక, ఆ తర్వాత నూనేపల్లి మీదుగా నంద్యాల చేరుకుని సాయంత్రం 4 గంటలకు గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం పాణ్యం, సుగాలిమిట్ట, హుస్సేనాపురం, ఓర్వకల్, నన్నూర్, పెద్దటేకూరు, చిన్న కొట్టాల, కె.మార్కాపురం క్రాస్, నాగలాపురంలో ప్రజలతో మమేకమవుతూ గూడూరు మండలం నాగులాపురంలో సీఎం జగన్ రాత్రికి బస చేయనున్నారు. ఇక, తొలి రోజు ఉమ్మడి జిల్లాలో 5 నియోజకవర్గాల్లో 131 కిలో మీటర్ల మేర జగన్ బస్సు యాత్ర కొనసాగింది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# నేడు ఎమ్మెల్సీ ఉపఎన్నిక




మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం పోలింగ్ జరగనుండగా.. స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలక కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరితోపాటు ఎక్స్ అఫీషియో హోదాలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతోపాటు ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం 1,439 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ అఫీషియోగా కొడంగల్‌లో ఓటు వేయనున్నారు. ఉపఎన్నికకు మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. బ్యాలెట్ ద్వారా ప్రజాప్రతినిధులు ఓట్లు వేయనున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి అన్ని పోలింగ్ సెంటర్లకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. వచ్చే నెల రెండో తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

**నేరుగా పోలింగ్ కేంద్రాలకే..**

పార్లమెంట్ ఎన్నికలకు ముందు వచ్చిన ఉప ఎన్నిక కాగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి పోటీ పడుతున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని పట్టు సాధించాలని బీఆర్ఎస్.. ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని కాంగ్రెస్ ఎత్తుకు పైఎత్తులతో ముందుకు సాగుతున్నాయి. ఓటర్లు చేజారొద్దనే ఉద్దేశంతో ఓటర్లను ఆయా పార్టీలు గోవా, ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించారు. గురువారం పోలింగ్ జరగనుండగా.. బుధవా రం తెల్లవారుజామునే క్యాంపుల నుంచి తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు తెలిసింది. రాత్రికి వారిని హైదరాబాద్‌లోని రిసార్ట్స్ కు తరలించి.. గురువారం ఉదయం నేరుగా ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ సెంటర్లకు తీసుకురానున్నారు. సంఖ్య ప్రకారం బీఆర్ఎస్ కు మెజారిటీ ఉన్నా, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఆ తర్వాత మారిన రాజకీయ పరిణా మాల క్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. గెలుపుపై ఆయా పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## తెలంగాణ టెట్ 2024కు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం..

తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (మార్చి) 2024 నిర్వహణకు రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. టెట్ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 27 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ అందుబాటులోకి వచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చింది. ఇక మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఇప్పటికే నోటిఫికేషన్‌లో విద్యాశాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11 జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్షను నిర్వహిస్తారు. కాగా ప్రభుత్వం భర్తీ చేసే ఉపాధ్యాయుల పోస్టులకు హాజరుకావాలంటే తప్పనిసరిగా టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. టెట్‌లో కనీస అర్హత మార్కులు సాధించిన వారు టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) రాసేందుకు అర్హులు. టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టీఆర్‌టీలో 80 శాతం మార్కులకు పరీక్ష నిర్వహించి మిగిలిన 20 శాతం మార్కులను టెట్ నుంచి తీసుకుని తుది ర్యాంకు నిర్ణయిస్తారు. టెట్ పరీక్ష మొత్తం 2 పేపర్లకు ఉంటుంది. పేపర్-1కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డీఈడీలో అర్హత సాధించి ఉండాలి. ఇంటర్‌లో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ఇతరులు 45 శాతం మార్కులు తప్పనిసరిగా సాధించి ఉండాలి. 2015లోపు డీఈడీ చేసిన వారైతే జనరల్ అభ్యర్థులు ఇంటర్‌లో 45 శాతం, ఇతరులకు 40 శాతం మార్కులతో పాసైతే అర్హత సాధించినట్లే. ఇక టెట్ పేపర్-2కి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీ, బీఈడీలో కనీస అర్హత మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. డిగ్రీలో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. 2015లోపు బీఈడీ చేసిన వారైతే జనరల్ అభ్యర్థులు 50 శాతం, ఇతరులు 40 శాతం మార్కులు సాధించినా అర్హత సాధించినట్లే. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. రెండు పేపర్లు రాస్తే రూ.2,000, మూడు పేపర్లకు రాస్తే రూ.3000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టెట్ ఒక్కో పేపర్ 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ కేటగిరీలో 90 మార్కులు, బీసీలో 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 60 మార్కులు సాధిస్తే టెట్ అర్హత పొందొచ్చు. పేపర్-1 పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఉంటుంది.

## సనోఫి టీకాలను పంపిణీ చేయనున్న డాక్టర్ రెడ్డీస్

సనోఫి హెల్త్‌కేర్ ఇండియా టీకాలను మనదేశంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పంపిణీ చేయనుంది. చిన్న పిల్లలు, పెద్దల కోసం సనోఫి ఉత్పత్తి చేస్తున్న టీకాలైన హెగ్జాజిమ్, పెంటాగ్జిమ్, టెట్రాగ్జిమ్, మెనక్ట్రా, ఫ్లూక్వాడ్రి, అడాసెల్, అవాగ్జిమ్ 80యూ బ్రాండ్లను డాక్టర్ రెడ్డీస్ పంపిణీ చేస్తుంది. ఈ బ్రాండ్ల వార్షిక అమ్మకాలు రూ.425 కోట్లకు పైగానే ఉంటున్నాయి. ఈ టీకాల ఉత్పత్తి, దిగుమతి బాధ్యతలను సనోఫి నిర్వహిస్తుంది. దేశీయంగా పంపిణీ, విక్రయాలను డాక్టర్ రెడ్డీస్ చేపడుతుంది. దీనివల్ల టీకాల విభాగంలో రెండో స్థానంలోకి చేరే అవకాశం తమకు కలుగుతుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (ఇండియా, ఎమర్జింగ్ మార్కెట్స్) ఎం.వి.రమణ వివరించారు. భారతదేశంలో తమ అమ్మకాలు పెంచుకునేందుకు ఈ ఒప్పందం వీలుకల్పిస్తుందని సనోఫి ఇండియా జీఎం (వ్యాక్సిన్స్) ప్రీతి ఫుట్నాని అన్నారు.

## ఇంటికి కిలో బంగారం పంచినా జగన్‌కు ఓటమే




అయిదేళ్ల అరాచక పాలనతో విసిగిన జనం.. జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో శాశ్వతంగా బంధించేందుకు నిర్ణయించుకున్నారని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో గెలవడానికి ఇంటికి కిలో బంగారం పంచినా ఆయనకు ఓటమి తప్పదని పేర్కొన్నారు. తాయిలాల పంపకంలాంటి చీప్‌ట్రిక్స్‌తో ప్రజాభీష్టాన్ని తారుమారు చేయలేరని స్పష్టం చేశారు. 'రేణిగుంటలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి చెందిన గోదాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉన్న చేతి గడియారాలు, స్పీకర్లు, విసనకర్రతోపాటు మొత్తం 52 రకాల వస్తువుల డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటినైతే పట్టుకున్నారు కానీ ఇసుక, మద్యం దందాలో దోచిన సొమ్ము డంప్ సంగతేంటి? ప్రజాగ్రహ జ్వాలలను అడ్డుకోవడం జగన్‌కు అసాధ్యం' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. గోదాంలో దాచిన వస్తువులున్న వీడియోను ట్వీట్‌కు జత చేశారు.

కంటెయినర్ వ్యవహారంపై డీజీపీ సమాధానం చెప్పాలి 'రోజూ నా కాన్వాయ్ తనిఖీ చేస్తున్నారు. ఒక్క ఎన్నికల నిబంధనల ఉల్లంఘన అయినా కనిపించిందా? నిబంధనలు బేఖాతరు చేసి మీ ఎదురుగా సీఎం ఇంట్లోకి వెళ్లిన కంటెయినర్‌ను ఎందుకు తనిఖీ చేయలేదు? అందులో ఏముంది? బ్రెజిల్ సరకా? మద్యంలో మెక్కిన రూ.వేల కోట్లా? రాష్ట్ర సచివాలయంలో దాచిన దొంగ దస్త్రాలా? ఈ ప్రశ్నలకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సమాధానం చెప్పాలి' అని మరో ట్వీట్‌లో లోకేశ్ డిమాండ్ చేశారు.



## కరిష్మా శర్మ హాట్ లుక్

నటి మరియు మోడల్ కరిష్మా శర్మ తన బోల్డ్ స్టైల్ కారణంగా తరచుగా ఇంటర్నెట్‌లో చర్చించబడుతోంది. కరిష్మా శర్మ తన సోషల్ మీడియా ఖాతాలో బోల్డ్ లుక్‌లను పంచుకోవడం ద్వారా అభిమానుల మధ్య తరచుగా చర్చలో ఉంటుంది. కరిష్మా శర్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో వైట్ కలర్ బాడీకాన్ లుక్‌లో చాలా కూల్ చిత్రాలను పంచుకుంది. ఈ చిత్రాలలో, నటి కెమెరా ముందు పోజులిచ్చింది. చాలా హాట్ లుక్.తెల్లటి లుక్‌లో సముద్రానికి నిప్పుపెట్టిన నటి.ఆమె ఈ గ్లామరస్ లుక్‌ని అభిమానులు ఇష్టపడుతున్నారు.కరిష్మా తన బోల్డ్ బికినీ లుక్ గురించి కూడా చర్చలో ఉంది.ప్రస్తుతం కరిష్మా శర్మ బోల్డ్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. .



## గ్లోబల్ బ్యూటీ అడుగు జాడల్లో త్రిప్తి దిమ్రీ

యానిమల్ సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన బ్యూటీ త్రిప్తి దిమ్రీ. ఒక్క పాటతోనే నేషనల్ సెన్సేషన్‌గా మారిన ఈ భామ బాలీవుడ్‌లో లాంగ్ జర్నీని కోరుకుంటున్నారు. అందుకే ఓ గ్లోబల్ బ్యూటీని ఇన్‌స్పిరేషన్‌గా తీసుకొని కెరీర్ ప్లాన్ చేసుకుంటున్నారు ఈ బ్యూటీ.యంగ్ బ్యూటీ త్రిప్తి దిమ్రీ, యానిమల్ చిత్రంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. సినిమాలోని ఆమె మెయిన్ లీడ్ కానప్పటికీ.. హీరోయిన్ రష్మిక కంటే ఆమెకు ఎక్కువ క్రేజ్ వచ్చింది. త్వరలో ఆమె పలు ఆఫర్లను చేజిక్కించుకోవడంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.యానిమల్ సినిమాకు ముందు త్రిప్తి అనే హీరోయిన్ ఇండస్ట్రీలో ఉన్న సంగతే ఆడియన్స్‌కు తెలీదు. కానీ యానిమల్ రిలీజ్ తరువాత ఓవర్ నైట్ స్టార్ లీగ్‌లో ఫ్లాష్ అయ్యారు ఈ బ్యూటీ. ఆరేళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నా రాని గుర్తింపు ఈ సినిమాలో చేసిన ఒక్క పాటతో వచ్చింది.ప్రజెంట్ కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ఈ భామ తనకు ఓ బాలీవుడ్ సీనియర్ నటి ఇన్‌స్పిరేషన్ అంటున్నారు. బాలీవుడ్లో కెరీర్ స్టార్ట్ చేసి హాలీవుడ్ రేంజ్‌కు ఎదిగిన ప్రియాంక చోప్రా సిల్వర్ స్క్రీన్ జర్నీనే తనకు ఇన్‌స్పిరేషన్ అన్నారు త్రిప్తి దిమ్రి.

